పాతబస్తీలో విద్యుత్ ఉన్నతాధికారుల పర్యటన



చార్మినార్: పాతబస్తీ చార్మినార్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ శుక్రవారం పర్యటించారు. పంజేషా సబ్ స్టేషన్‌తో పాటు మొఘల్‌పురా సెక్షన్ పరిధిలోని 11 కేవీ విద్యుత్ ఫీడర్ సర్వేను కొత్తగా అమలులోకి వచ్చిన యాప్ ద్వారా నిర్వహించి వివరాలు సేకరించారు. అనంతరం గుల్జార్ హౌజ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలను యాప్ ద్వారా నమోదు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లు చెల్లింపుల్లో సమస్యలున్నాయా..అనే విషయాలను సైతం స్థానికంగా ఉన్న వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా సాంకేతిక లోపాలతో సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట మెట్రో జోన్ సీజీఎం కె.ఎం.స్వామితో పాటు చార్మినార్ డీఈ లింగయ్య, ఏడీఈ విజయ్‌కుమార్, ఏఈలు ఉన్నారు.

కందూరు మహేశ్వర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న విజయ రాఘవన్ తదితరులు

సుల్తాన్‌బజార్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం సుభాన్‌పురా సర్వేనెం.13-9, 228, 98, 91, 224, 225లలో చట్ట విరుద్ధంగా వెంచర్లు నెలకొల్పి ఒకే ప్లాట్లు ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు విక్రయించి కోట్ల రూపాయాలు అక్రమంగా ఆర్జించడమే కాకుండా తూతూ మంత్రంగా ఇన్‌కమ్‌ట్యాక్స్ చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న రంగారెడ్డి జిల్లా కుందూరు మహేశ్వర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలనినేషనల్ సొసైటీ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఎన్ఎస్‌హెచ్‌ఆర్) సలహాదారు, విశ్రాంత తహసీల్దార్, విజయరాఘవన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాధితులు ఎనుముల సురేందర్, కొల్లు దుర్గా ప్రసాద్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. 21 ఎకరాల 31 గుంటలతో అక్రమ లేఅవుట్ ద్వారా ప్లాట్లు అమ్మి రూ.40 కోట్లు సొమ్ము చేసుకున్నాడని ఆరోపించారు. ఇతనిపై ఇప్పటికే పలు పోలీస్‌స్టేషన్లలో పీడీ యాక్ట్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ సమావేశంలో తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్, రితిక, ప్రధాన కార్యదర్శి సాయితేజ పాల్గొన్నారు.

కోట మైసమ్మ ఆలయం పునర్ నిర్మాణ పనులు ప్రారంభం

చార్మినార్: కోట మైసమ్మ పురాతన ఆలయ దర్వాజతో పాటు ఆలయ పునర్ నిర్మాణ పనులను భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య పూజలు నిర్వహించి ప్రారంభించారు. అప్పటి నిజాం కాలంలో హైదరాబాద్ నగరానికి ఉన్న పురాతన దర్వాజాలలో కోట మైసమ్మ దర్వాజ కూడా ఒకటి. కోట మైసమ్మ ఆలయ దర్వాజకు చారిత్రక ప్రాధాన్యత ఉంది. కొన్నేళ్లుగా ఈ దర్వాజ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అలాగే ఆలయం పై అంతస్తు కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయ కమిటీ ప్రతినిధులు సంబంధిత దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలను సమర్పించింది. ఎట్టకేలకు నిధులు మంజూరు కావడంతో పునర్నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. ఈ పూజా కార్యక్రమాల్లో పొటేల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ యాదవ్, రాయికోటి బాబురాజా, ప్యారసాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులకు పూజలు నిర్వహిస్తున్న గాజుల అంజయ్య తదితరులు

అభినందనలు



ప్రీతంను సత్కరిస్తున్న మురళీకృష్ణ

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.ప్రీతంను సికింద్రాబాద్ పార్లమెంట్ కాంటెస్టెడ్ క్యాండిడేట్ మురళీకృష్ణ శుక్రవారం ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. మురళీకృష్ణ మాట్లాడు తూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాల వారికి అండగా నిలిచి అందరికీ చేయూత అందిస్తున్నారు.

మేయర్‌కు ఆహ్వానం



చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఆహ్వానం అందజేశామని కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మేయర్‌ను కలిశారు. ఆమెకు ఆహ్వాన పత్రం అందజేసి ఉత్సవాలకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరినట్లు తెలిపారు.

విద్యార్థులు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి



అబిడ్స్: విద్యార్థులు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే ఆరోగ్యకరంగా ఉంటారని జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అబిడ్స్‌లోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో విద్యార్థులకు పరిశుభ్రత, డెంగీ, ఇతర రోగాలపై అవగాహన కల్పించాలి. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు తమ ఇళ్ల వద్ద పరిశుభ్రంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఇంటి ఆవరణలో, పరిసరాల్లో దోమలు ఉత్పత్తి కాకుండా చూసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రేవ్ బ్రదర్ షాజన్ ఆంథోని మాట్లాడు తూ..పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యం చెందే విధంగా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

గోల్కొండ: విద్యుత్ వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందే విధంగా విద్యుత్ శాఖ అధికారులు కష్టపడి పని చేయలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్ సాలార్ బ్రిడ్జీ వద్ద విద్యుత్ బిల్లు చెల్లింపులు, ఎఫ్‌టీసీ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా, విద్యుత్ బిల్లుల చెల్లింపు తదితర విషయాలపై విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పలు మార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగినప్పుడు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి అధికారులు వెంటనే రంగంలోకి దిగానే ఆయన సూచించారు. అదే విధంగా అధిక బిల్లులు, పెండింగ్ విద్యుత్ బిల్లులపై కూడా విద్యుత్ వినియోగదారులకు అధికారులు అందుబాటులో ఉండి వారి ఫిర్యాదులు పరిష్కరించే విధంగా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, విద్యుత్ డీఈ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఏఈ యూసుఫ్‌బాబు తదితరులున్నారు.



విద్యుత్ బిల్లింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌసర్

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



యాకుత్‌పురా: ఆషాఢ మాసం బోనాల సందర్భంగా హరిబౌలీ శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో అయిదు శుక్రవారం పాటు నిర్వహించే అమ్మవారి సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా ప్రారభమయ్యింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు మహాహారతి నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్ని అమ్మవారికి అర్చన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్ పర్షాద్, కార్యదర్శి దత్తత్రేయ, సభ్యులు సతీష్, భరత్ ప్రకాష్, కృష్ణ, ఎస్.పీ క్రాంతి కుమార్, వినోద్, చేతన్ సూరి, సాయి కిరణ్ పాల్గొన్నారు.

సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలి





గన్‌ఫౌండ్రీ: సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో సాంస్కృతిక సంస్థ కురుగంటి కళాక్షేత్రం 27వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తల్లిదండ్రులు తమ పిల్లలను సాంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచి ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించాలని కోరారు. అంతకు ముందు సంస్థకు చెందిన 50 మంది చిన్నారులు ఏక కాలంలో చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా నృత్య గురువు రాధిక రూపకల్పన చేసిన రామదాసు విజయం నృత్య రూపకం కనుల పండువగా ప్రదర్శించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ కళావాహిణి అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, కంచెర్ల శ్రీనివాస్, సంగిరాల నరేష్, నాట్య గురువు ఇందిరా హేమ పాల్గొన్నారు.

సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా చంద్రమోహన్



గోల్కొండ: సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా సి.చంద్రమోహన్ నియమితులయ్యారు. ఐపీఎస్ అధికారుల బదిలీలో భాగంగా ఇక్కడ డీసీపీగా ఉన్న ఉదయ్‌కుమార్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ స్థానంలో నియమితులైన చంద్రమోహన్ శుక్రవారం మెహిదీపట్నంలోని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

నెంబర్ ప్లేట్ సక్రమంగా లేని వాహనదారులకు జరిమానా

చార్మినార్: ఈనెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన బీఎన్ఎస్ కొత్త చట్టం కింద హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో గురువారం నిందితులకు సంబంధిత జడ్జి జరిమానా విధించారు. చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..గత నెల 30వ తేదీ అర్ధరాత్రి నుంచి ఈ నెల 1వ తేదీ తెల్లవారు జాము వరకు గుల్జార్‌హౌజ్ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలలో సొహెల్ అన్సారీ, ఎస్కే సన్వర్ తదితరులు పట్టుబడ్డారు. వీరి వాహనాల నెంబర్ ప్లేట్ సక్రమంగా లేకపోవడంతో 177 ఎంవీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి నిందితులిద్దరిని 1వ స్పెషల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ దేవీ రెడ్డి అభిరాం రెడ్డి ముందు హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.1400 చొప్పున రూ.2800 జరిమానా విధించినట్లు కమతం చంద్రశేఖర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



మహ్మద్ ఖాజా

గౌలిపురా: మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కె.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా మొఘల్ హోటల్ ప్రాంతానికి చెందిన మహముదా బేగం, మహ్మద్ ఖాజా (53)లు దంపతులు. కాగా మహ్మద్ ఖాజా గత కొన్ని రోజులుగా పక్షవాత, మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. మే 10న మహ్మద్ ఖాజా ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోహిత్ (ఫైల్)

లంగర్‌హౌస్: దిచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రీతి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగుడ మాజీ సర్పంచ్ సునీత రాజ్‌కుమార్‌లకు ఒక కుమార్తె, ఒక కుమారుడు రోహిత్(26). రోహిత్ చదువులు పూర్తి చేసుకొని మొయినాబాద్‌లో బట్టల వ్యాపారం చేస్తున్నాడు. గురువారం రాత్రి తన వ్యాపారం ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. రాత్రి 11.30గంటలకు టిప్పుఖాన్ బ్రిడ్జి వద్దకు చేరుకున్న రోహిత్‌కు నీటిలో గుంతలు కనిపించక, ఆ గుంతలో వాహనం వెళ్లడంతో అదుపు తప్పి పడిపోయాడు. అతని తల రోడ్డుకు తగిలి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం లంగర్‌హౌస్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆయన మృతిచెందాడు. శనివారం పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రత్యేక పూజలు



గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయ విగ్రహ ఘటానికి శుక్రవారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ ఎస్.సర్వేశ్, అధ్యక్షుడు కాలే శ్రీనివాస్, బస్తీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జి.కృష్ణ, కోశాధికారి డి.మనీష్, ఆలయ కుమ్మరి జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

రచయిత్రి భాను తేజశ్రీకి అభినందనలు



భాను తేజశ్రీకి అభినందనలు తెలుపుతున్న మాజీ సీఎం నాదేండ్ల భాస్కర్‌రావు

అఫ్జల్‌గంజ్: రచయిత్రి భాను తేజశ్రీకి మాజీ సీఎం నాదేండ్ల భాస్కర్‌రావు అభినందనలు తెలిపారు. ఇటీవల పలు కవితల ద్వారా విశేషంగా అందరినీ ఆకట్టుకుంటున్న భాను తేజశ్రీ శుక్రవారం మాజీ సీఎం నాందేండ్ల భాస్కర్‌రావును ఆమె కలిశారు. పలు కవితల ద్వారా అందరిని మంత్రముగ్దులను చేస్తున్న ఆమెను అభినందనించారు. ఈ కార్యక్రమంలో న్యూ ఇండియన్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రవికుమార్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

బెల్లయ్య నాయక్‌కు సత్కారం



డాక్టర్ బెల్లయ్య నాయక్‌ను సత్కరిస్తున్న రామచందర్

నాంపల్లి: ఇటీవల తెలంగాణ షెడ్యూల్ తెగల ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బెల్లయ్య నాయక్ తేజావత్‌ను పలువురు కాంగ్రెస్ నేతలు, గిరిజన సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రామచందర్ నేతృత్వంలో అతడి కార్యవర్గం సభ్యులందరూ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.సురేష్, ఎస్.బాలు నాయక్ పాల్గొన్నారు.

బోనాలకు ఏర్పాట్లు వేగవంతంగా చేపట్టాలి



వేడుకల్లో పాల్గొన్న ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు, సాయికుమార్ తదితరులు

అబిడ్స్: బోనాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాట్లను వేగవంతగా చేపట్టాలని బజరంగ్ సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్. లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. బోనాల వేడుకలు ప్రారంభమైనా పాతబస్తీలో ఆలయాల వద్ద ఇంకా అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదన్నారు. శుక్రవారం సచివాలయంలోని నల్లపోచమ్మ ఆలయంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఎన్ఆర్. లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాతబస్తీలో పర్యటించి బోనాల ఏర్పాట్లను పర్యవేక్షించారన్నారు. సాయి కుమార్, శివలాల్, ఎర్రం శ్రీనివాస్, మనోజ్, నరేష్, ప్రవీణ్ యాదవ్. అస్మిత్ అగర్వాల్ పాల్గొన్నారు.

'ఘంటసాల గీతాలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయి'



గన్‌ఫౌండ్రీ: ఘంటసాల పాటలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని శ్రీచక్ర లలిత ఆది పరాశక్తి ఉపాసకులు ఉదయ చంద్రయోగి అన్నారు. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ వాగ్దేవి ఘంటసాల సంగీత సాంస్కృతిక విభావరిని శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల భక్తి, లలిత, యుగల గీతాలాపన, ఆధ్యాత్మిక ప్రవచనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా, అఖిల భారత ఆలయ అధ్యక్షుడు మూసాపేట రామరాజు, సంగీత దర్శకుడు వి.సదాశివ శర్మ, నవరస గాయని ఆమని, స్వర రత్న ఇందు నయన పాల్గొన్నారు.

గోల్కొండ అమ్మవారి హుండీ లెక్కింపు

గోల్కొండ: గోల్కొండ కోటపై గల అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని హుండీ ఆదాయాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో లెక్కించారు. మొదటి బోనం, రెండవ బోనం సందర్భంగా రూ. 2,91,400 నగదు ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షులు సాయిబాబాచారి, లీలావతి, నవీన్‌ప్రసాద్ తదితరులున్నారు.

'మొహర్రం పవిత్రమైన మాసం'



మాట్లాడుతున్న మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ ఆలీషా

గోల్కొండ: మొహర్రం పవిత్రమైన మాసమని ఆల్ ఇండియా సీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. శుక్రవారం గోల్కొండ దిలావర్‌షా నగర్‌లోని అక్తరీ మసీదులో మొహర్రంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దైవాన్ని ప్రగాఢంగా నమ్మే వారు, నాస్తికుల మధ్య జరిగిన యుద్ధం మొహర్రం నెలలోనే జరిగిందన్నారు. కర్బలా మైదానంలో జరిగిన పవిత్ర యుద్ధంలో ఎందరో దైవ భక్తులు మృతి చెందారని ఆయన అన్నారు. హిమామ్ హుస్సేన్ ఈ పవిత్ర యుద్ధంలో వీరమరణం చెందారని ఆయనతో పాటు మరేందరో ఈ పవిత్ర యుద్ధంలో అమరులయ్యారని ఆయన పేర్కొన్నారు.

కూతురుని విక్రయించిన కేసులో ముగ్గురికి రిమాండ్

చాంద్రాయణగుట్ట: భార్యను బెదిరించి కన్న కూతురును విక్రయించిన కేసులో ముగ్గురు నిందితులను బండ్లగూడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొహమ్మద్‌నగర్‌కు చెందిన ఆసిఫ్, ఆస్మా బేగంలు దంపతులు. వీరికి కుమారుడు (6), కూతురు (18 రోజులు) సంతానం. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఆసిఫ్ ఇటీవలే జన్మించిన కూతురును విక్రయిస్తే తన సమస్యలు తీరుతాయని భావించి తనకు పరిచయం ఉన్న చాంద్ సుల్తానాకు చెప్పాడు. అయితే చాంద్ సుల్తానా కర్ణాటకలో ఉన్న తన బంధువు మినాల్ సాద్‌కు చెప్పింది. అయితే మినాల్ సాద్ తనకు విక్రయిస్తే లక్ష రూపాయలు ఇస్తానని చాంద్ సుల్తానా ద్వారా ఆసిఫ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ నెల 8న ఆసిఫ్ భార్య ఆస్మాను బెదిరించి కర్ణాటకలోని మినాల్ సాద్‌కు లక్ష రూపాయలకు విక్రయించాడు. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురైన భార్య ఆస్మా బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 11న ఫిర్యాదు చేసింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న బండ్లగూడ పోలీసులు 24 గంటల్లోనే బాలికను రక్షించి తల్లి అస్మాకు అప్పగించారు. కూతురును విక్రయించిన తండ్రి ఆసిఫ్, మధ్యవర్తి చాంద్ సుల్తానా, కొనుగోలు చేసిన మినాల్ సాద్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మత సామరస్యానికి ప్రతీక బోనాలు



అబిడ్స్: మత సామరస్యానికి ప్రతీకగా బోనాల ఉత్సవాలు దోహదపడుతాయని రిలయన్స్ హైటెక్ స్కూల్ డైరెక్టర్ విద్యావేత్త జితేందర్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం స్కూల్‌లో విద్యార్థులు బోనాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జితేందర్ సింగ్ వేడుకలు ప్రారంభించి ప్రసంగించారు. తమ విద్యసంస్థల్లో విద్యార్థులకు అన్ని పండుగలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా బోనాలతో తరలివెళ్లి కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో అమ్మవారి బోనాలు సమర్పించారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత



గోల్కొండ: మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత అని శ్రీ చైతన్య పాఠశాల మెహిదీపట్నం ఏజీఎం కృష్ణ అన్నారు. శుక్రవారం పాఠశాలలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని పచ్చదనం పెంచడానికి తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, డీన్ మల్లేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను మత్స్యకారులకు అందించేందుకు కృషి



అబిడ్స్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను మత్స్యకారులకు అందించేందుకు కృషి చేస్తానని మత్స్యశాఖ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. నూతన చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. మత్స్యశాఖ అభివృద్ధికి, సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానన్నారు. గత పదేళ్లుగా అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉన్న మత్స్య కార్మికులకు అండగా ఉండి వారి అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

నూతన పార్లమెంటు భవనం అద్భుతం



జియాగూడ: ఢిల్లీలోని నూతన పార్లమెంట్ భవనం ఎంతో అద్భుతంగా ఉందని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పడాల అనంతకృష్ణ అన్నారు. శుక్రవారం భారతీయ జనతాపార్టీ జాతీయ శాఖ ఆహ్వానం మేరకు నగరం నుంచి ఢిల్లీ వెళ్లి పార్లమెంటు భవనాన్ని బృందంతో సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన నూతన పార్లమెంట్ భవనంకు ఎంతో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా నాయకులు సట్టగళ్ల శ్యామ్‌లింగం, అమిత్‌కుమార్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత



గౌలిపురా: తప్పిపోయిన బాలికను భవానీనగర్ పోలీసులు మూడు గంటల్లోనే గుర్తించి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన ఫౌజియా ఫాతిమా కూతురు ఇమాన్ ఫాతిమా (8) బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండటంతో స్కూల్‌కు పంపించడం లేదు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఇమాన్ ఫాతిమా తన సోదరులతో మదర్సాకు వెళ్లేందుకు నిద్రలేచి సిద్ధమైంది. ఇంతలో తల్లి ఫౌజియా ఫాతిమా వంటగదిలోకి వెళ్లగానే..ఇమామ్ ఫాతిమా ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి మూడు టీమ్‌లను ఏర్పాటు చేసి బాలిక ఆచూకీ కోసం వెతకగా హరిబౌలి ప్రాంతంలో కనిపించింది. బాలికను పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

యాకుత్‌పురా: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను అధికారులు సకాలంలో పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. నియోజకవర్గంలోని రెయిన్ బజార్ డివిజన్‌లోని ఇమాంబాడా, ఎస్ఆర్టీ కాలనీ, బయ్యా కా బాగ్, లండన్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతిరోజు బస్తీల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలు బస్తీల్లో రోడ్లు, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు, కమ్యూనిటీ హాల్, నాలాల విస్తరణ పనులను చేపట్టామన్నారు.